క్లుప్తంగా

'సుఖీభవ' వివరాల పరిశీలన


ఏవో ఉమాదేవి

కొయ్యూరు: రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతుల వివరాలను పరిశీలన చేస్తామని ఏవో ఉమాదేవి గురువారం తెలిపారు. దీనిలో భాగంగా రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది, వారి లాగిన్‌లో వచ్చిన రైతుల వివరాలను ఆమోదం తెలపాలన్నారు. ఆధార్, వెబ్‌ల్యాండ్‌లో ఒకే రకమైన పేరు ఉండాలన్నారు. దానిలో పేర్లు వేర్వేరుగా ఉండే ఆమోదం కావని చెప్పారు. అలాంటి రైతులు ముందుగా వారి పత్రాలను పరిశీలన చేసుకుని రెవెన్యూ అధికారుల ద్వారా సరిచేయించుకోవాలని సూచించారు. భర్త, భార్యలు ఇద్దరూ భూములు కలిగి ఉన్నా ఒకరికి మాత్రమే పథకం వర్తిస్తుందన్నారు.

బాబా ఆలయంలో అన్నదానం


అన్నదాన కార్యక్రమంలో భక్తులు

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఉదయం నుంచి చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని, భజనలు చేశారు. హారతి పాటలు పాడారు. పురోహితుడు భయ్యా భానుమూర్తి పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సింగంపల్లి గ్రామానికి చెందిన చదల వెంకటరెడ్డి, లక్ష్మి దంపతుల సహాయంతో భక్తులకు అన్నదానం చేశారు.

ఆలయంలోకి వర్షపు నీరు


వర్షపు నీటితో నిండిపోయిన ఆలయ ప్రాంగణం

గూడెంకొత్తవీధి: సంకాడ పంచాయతీ పెద జడుమూరులో జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ డ్రైనేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షం కురిస్తే సీతారాముల ఆలయం సమీపంలో నీరు నిలిచిపోతోంది. ఆలయ ప్రాంగణం మొత్తం నీటితో నిండిపోతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

బీసీ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు


పదిలో జిల్లా స్థాయిలో ప్రతిభా అవార్డులు అందుకున్న బీసీ విద్యార్థులు దుర్గ, జగత్

రాజవొమ్మంగి: స్థానిక బీసీ గర్ల్స్, బాయ్స్ వసతిగృహాలకు చెందిన మాకిరెడ్డి జగత్, నల్లమ శ్రీదుర్గ పదో తరగతి పరీక్షల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు వారు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత చేతుల మీదుగా ప్రతిభా అవార్డులు అందుకున్నారు.

విద్యతోనే భవిష్యత్తు

డీఎస్పీ శ్రీనివాసరావు


విద్యార్థులకు ఎంసెట్ హాల్ టికెట్లు అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం : విద్యతోనే భవిష్యత్‌లో రాణించగలరని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. ఎస్ఎఎస్ ఎడ్యుకేషనల్ సొసైటీ చారిటీ ఆధ్వర్యంలో రెండు నెలలుగా ఉచిత ఎంసెట్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు గురువారం హాల్ టికెట్లను డీఎస్పీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిటీ వారు ఉచితంగా ఎంసెట్ కోచింగ్ ఇవ్వడం అభినందనీయమన్నారు. చారిటీ వారు కల్పించిన అవకాశంతో ఎంసెట్‌లో మంచి ర్యాంకులు సాధించి మీ భవిష్యత్‌కు బాట వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యతో మీరు అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్.కృష్ణ, చారిటీ ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు, కరస్పాండెంట్ ఎస్.ఉమా మహేశ్వరి, శివ, వంశీ పాల్గొన్నారు.


జలగలగెడ్డ గ్రామం


తాగునీటికి వినియోగిస్తున్న కలుషిత ఊటగెడ్డ నీరు

దారీ తెన్నూ లేదు.!

జలగలగెడ్డకు కాలినడకే దిక్కు

ప్రభుత్వ పథకాలకు దూరం

అర్ధ శతాబ్దంగా తప్పని అవస్థలు


అటవీ ప్రాంతంలో నుంచి నీటిని తీసుకొస్తున్న మహిళలు


కాలినడకన అటవీ ప్రాంతంలో సెల్ లైట్ల వెలుగులో మృతదేహాన్ని మోసుకువస్తున్న గ్రామస్తులు(ఫైల్)

చింతపల్లి: ఆంధ్రా కశ్మీరుగా పేరొందిన లంబసింగికి కూతవేటు దూరంలో ఉన్న జలగలగెడ్డకు దారీ తెన్నూలేదు. ఇక్కడ జీవనం సాగిస్తున్న ఆదిమ జాతి గిరిజనులు(పీవీటీజీ) కనీసం కాలిబాట కూడా లేకపోవడంతో అటవీ ప్రాంతం నుంచి బాహ్య ప్రపంచంలోకి రావడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. లంబసింగి పంచాయతీ పరిధిలోని ఈ గ్రామం ఏర్పడి అర్ధ శతాబ్దం కావస్తోంది. ఎత్తయిన కొండపై ఉన్న ఈ గ్రామంలో సుమారు 30 ఆదిమ జాతి తెగలకు చెందిన కుటుంబాలు పోడు వ్యవసాయమే ఆధారంగా జీవనాన్ని సాగిస్తున్నాయి. లంబసింగి జంక్షన్(కొర్రుబయలు) కూత వేటు దూరంలోనే ఈ గ్రామం ఉంది. అంటే ఒక కిలోమీటరు కూడా దూరం ఉండదు. లంబసింగి గ్రామానికి చెందిన రైతులు కాఫీ తోటల మధ్యలోంచి ఈ గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఏళ్లు గడుస్తున్నా కాలిబాట కూడా పూర్తిగా లేక పోవడంతో రాకపోకలు సాగించడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే లంబసింగి ఆరోగ్య కేంద్రానికి గానీ మండల కేంద్రానికి గానీ తీసుకురావాలంటే అటవీ ప్రాంతం మధ్య నుంచి కాలినడకన డోలీ మోతపై తీసుకురావల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల ఓ మృతదేహాన్ని అర్ధరాత్రి గ్రామానికి సెల్‌ఫోన్ లైటింగ్‌లో తీసుకెళ్లాల్సిన దీన పరిస్థితి తలెత్తింది.

రహదారే ప్రధాన సమస్య

జలగలగెడ్డ గ్రామానికి రహదారే ప్రధాన సమస్యగా పరిణమించింది. గ్రామానికి రహదారి సౌకర్యం లేక పోవడంతో ప్రభుత్వ పథకాలకు ఆ ఆదిమ జాతి గిరిజనులు దూరమవుతున్నారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, మంచినీటి సదుపాయాలు లేక నానా అవస్థలు పడుతున్నారు. విద్యార్థులు 2 కిలోమీటర్ల దూరంలో లంబసింగి పంచాయతీ కేంద్రానికి, అంగన్‌వాడీ పిల్లలు కిలోమీటరు దూరంలో ఉన్న కొర్రబయలు జంక్షన్‌కు కాలినడకన వెళ్తున్నారు. తాగునీటికి ఎటువంటి సౌకర్యం లేకపోవడంతో కొండకు దిగువ ప్రాంతంలో ఉన్న కలుషిత ఊటగెడ్డ నీరే దిక్కవుతోంది. ఆ నీటిని తాగి అనారోగ్యం పాలు కావల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలి



జలగలగెడ్డ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించడానికి అధికారులు చర్యలు చేపట్టాలి. గ్రామం ఏర్పడి దశాబ్దాలు కావస్తున్నా నేటికీ అరణ్యంలో కాలినడకే శరణ్యంగా మారింది. ఎంతో మంది అధికారులకు విన్నవించుకున్నాం. ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యానికి చొరవ చూపాలి.

– గెమ్మిలి రామదాసు, గ్రామపెద్ద, జలగలగెడ్డ గ్రామం

ప్రభుత్వ పథకాలకు దూరం



మా గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నాం. ఇప్పటికే మా గ్రామానికి ప్రభుత్వం తరఫున ఇళ్లు మంజూరయ్యాయి. అయితే రహదారి సౌకర్యం లేక గృహ నిర్మాణ సామగ్రిని తీసుకెళ్లలేకపోతున్నాం. దీంతో ఇప్పటికీ శిథిల స్థితిలో ఉన్న ఇళ్లలోనే తల దాచుకుంటున్నాం. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంతో పాటు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. పక్కా ఇళ్లతో పాటు ఏ పథకానికి నోచుకోలేని దుస్థితిలో ఉన్నాం.

– గెమ్మిలి బాబూరావు, గ్రామస్తుడు, జలగలగెడ్డ

ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన వీహెచ్‌పీ సభ్యులు


ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను సత్కరిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

రంపచోడవరం: ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డిని విశ్వహిందూ పరిషత్ కార్యవర్గ సభ్యులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యకర్తలు అన్నపరెడ్డి కృష్ణకిషోర్, నల్లమిల్లి వెంకట రామారెడ్డి, వెలిశెట్టి వీరభద్రప్రసాద్, లీలానాగు వీరభద్రగుప్తా, తదితరులు పాల్గొన్నారు.

ప్రీస్కూల్ విద్యతోనే పిల్లల పురోగతి


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వీఆర్‌పురం: ప్రీస్కూల్ విద్యతోనే పిల్లల పురోగతి సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సీడీపీవో నాగలక్ష్మి అన్నారు. వీఆర్‌పురం సెక్టర్ పరిధిలో రాజుపేట కాలనీలో గురువారం మెగా పాఠశాల సంసిద్ధత్ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ శారదా, జెడ్పీటీసీ సభ్యులు రంగారెడ్డి, ఉప సర్పంచ్ ముంజరాపు రాము, సూపర్‌వైజర్ నయోమిరాణి, ఐటీసీ ప్రథమ జిల్లా కో–ఆర్డినేటర్ పవన్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. ఈ సందర్భంగా ఏడు రకాల స్టాళ్లను ప్రదర్శించారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులకు అభివృద్ధి పత్రాలను అందజేశారు. మెగా సంసిద్ధత ఉత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పాఠశాల చైర్మన్ నాగేంద్ర, గ్రామ పెద్దలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'జనసేన నాయకులవి దిగజారుడు ప్రకటనలు'


మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాలయ్యపడాల్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గణబాబు

చింతపల్లి: వైఎస్సార్ సీపీ నుంచి పలువురు నాయకులు జనసేనలో చేరారని ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యపడాల్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాంగి గణబాబు పేర్కొన్నారు. గురువారం చింతపల్లి మండల కేంద్రంలో క్యాంప్ కార్యాలయంలో వారు మాట్లాడారు. మండలంలోని పెదబరడ పంచాయతీకి చెందిన కూడా రామకృష్ణ ఆధ్వర్యంలో కొంత మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారని జనసేన అరకు పార్లమెంటు ఇన్‌చార్జి వంపూరి గంగులయ్య ప్రకటించారని, అసలు రామకృష్ణ తమ పార్టీ కార్యకర్త కూడా కాదని స్పష్టం చేశారు. అటువంటి వ్యక్తికి కండువా కప్పి వైఎస్సార్ సీపీ నుంచి చేరిపోయినట్లు ప్రకటించుకోవడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గిరిజన ప్రాంతంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, దాని ఫలితంగా మండలంలో నేటికీ వైఎస్సార్‌సీపీ ఎంతో బలంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసులకు ప్రత్యేక డీఎస్సీ కోసం నేడు రాష్ట్ర సదస్సు


సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు

డుంబ్రిగుడ(అరకులోయ టౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మెగా డీఎస్సీలో ఐటీడీఏ పరిధిలో నోటిఫై చేసిన ఉపాధ్యాయ పోస్టులకు మినహాయింపు ఇచ్చి ఆదివాసులకు ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని అరకు జోన్ ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ కన్వీనర్ ఎం.రమేష్‌కుమార్, కో–కన్వీనర్లు కొర్రా శ్యామ్ మాట్లాడుతూ శుక్రవారం పాడేరులో జరిగే రాష్ట్ర స్థాయి సదస్సులో నిరుద్యోగ యువత పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ పోరాట కార్యాచరణకు సిద్ధం కావాలన్నారు. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటనలో స్పష్టత లేదన్నారు. మెగా డీఎస్సీ నుంచి ఆదివాసులకు 100 శాతం రిజర్వేషన్ అమలుకు స్పష్టంగా ప్రకటన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎ.అభి, జి.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గంగలమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన


మారేడుమిల్లిలో సారా విక్రయాలపై సమాచారాన్ని తెలుసుకుంటున్న ఎంపీడీవో శ్రీనివాస్

రంపచోడవరం: మారేడుమిల్లి గ్రామ దేవత గంగలమ్మ జాతర కోసం జరుగుతున్న ఏర్పాట్లను ఎంపీడీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్, రెవెన్యూ అధికారులు జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. స్థానికుల నుంచి సేకరించిన సమాచారం మేరకు కొన్ని ప్రాంతాలను తనిఖీ చేసి గతంలో నాటుసారా వ్యాపారం చేసిన వారితో తహసీల్దార్‌తో కలిసి మాట్లాడి, సారా విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించామన్నారు. వ్యాపారస్తులు నిబంధనలు మేరకు విక్రయాలు జరపాలన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మండలంలో ఉన్న హోటల్స్ అన్నింటిని తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. తనిఖీల్లో భాగంగా నిల్వ ఉన్న మాంసం, చేపలు వంటి పదార్థాలు గుర్తిస్తే హోటల్స్‌ను శాశ్వతంగా మూసే విధంగా చర్యలు తీసకుంటామన్నారు. మండలంలో నాటుసారా తయారీ కేంద్రాలు ఉన్నట్లు సమాచారం ఉందని, పోలీసుల సహకారంతో దాడులు జరిపి కేసులు నమోదు చేస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్ల ఏర్పాటుకు డిమాండ్


ప్రత్యేక స్టాళ్ల ఏర్పాటు కోసం ఇటీవల మార్కెటింగ్ అధికారి రాకేష్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

రాజవొమ్మంగి: ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ పంటలు సాగు చేస్తున్న గిరిజన రైతులను మరింతగా ప్రోత్సహించాలని కింద్ర గ్రామానికి చెందిన పలువురు రైతులు ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల జిల్లా కేంద్రం పాడేరు వెళ్లి జిల్లా వాణిజ్య, మార్కెటింగ్ అధికారి రాకేష్‌కు ఈ ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలు వివరిస్తూ అర్జీ ఇచ్చామని ఆదివాసీ నాయకులు బాలకృష్ణ, గంపా నాగరాజు తదతరులు తెలిపారు. అయినా నేటికీ ఎటువంటి స్పందన లేదన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలోని 11 మండలాల్లో రైతులు పండించే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించేందుకు అధికారికంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం ప్రజలు తమ ఆరోగ్యం కాపాడుకునేందుకు సేంద్రియ పద్ధతుల్లో, ప్రకృతి సేద్యంలో పండించిన ఆహార దినుసుల కోసం ఎదురు చూస్తున్నారని, ఆ పంటలకు మార్కెట్టులో ఎంతో డిమాండ్ ఉందని చెప్పారు. ఈ మేరకు అధికారులు చొరవ చూపి స్టాల్స్ ఏర్పాటు చేయాలని కోరారు.

మొండిగెడ్డలో క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

గూడెంకొత్తవీధి: మొండిగెడ్డలో దివంగత ఉపాధ్యాయుడు గబులంగి కృష్ణంరాజు జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. జెర్రెల, మొండిగెడ్డ, వంచుల, బలపం పంచాయతీలకు చెందిన క్రీడాకారులు పాల్గొనాలని నిర్వాహకులు గబులంగి బ్రదర్స్ కోరారు. ఈ పోటీలకు ఎలాంటి ప్రవేశ రుసుం లేదని తెలిపారు. మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలతో పాటు జ్ఞాపికలు అందిస్తామని నిర్వాహకులు నాగు, సత్తిబాబు చెప్పారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు వైద్యాధికారి జ్యోతి

గొలుగొండ: రోగులకు ప్రభుత్వ ఆసుపత్రిలో మంచి సేవలు అందేవిదంగా వైద్య సిబ్బంది పనిచేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి జ్యోతి తెలిపారు. ఆమె గురువారం గొలుగొండ పీహెచ్‌సీని సందర్శించారు. రోగులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ప్రతిరోజు ఈ పీహెచ్‌సీకి వచ్చిన రోగుల సంఖ్య, వారికి అందించే వైద్య సేవలు గురించి వైద్యాధికారి శ్యామ్ నుండి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీల సంఖ్య పెరగాలని, దీని కోసం ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఆస్పత్రిలో ఉన్న మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఉరుములతో భారీ వర్షం


డుంబ్రిగుడలో కురుస్తున్న భారీ వర్షం


గూడెంలో కురుస్తున్న వర్షం


కొయ్యూరులో కురుస్తున్న వర్షం

కొయ్యూరు: దాదాపుగా రెండు గంటల పాటు ప్రజలను పిడుగుల భయం వెంటాడింది. గురువారం ఉరుములు మెరుపులతో కొయ్యూరులో భారీ వర్షం పడింది. కొద్ది రోజుల కిందట అర్ధరాత్రి సమయంలో ఉరుములు రావడంతో విద్యుత్ సరఫరాలో తేడాలు వచ్చి టీవీలు, ఫ్రిడ్జ్‌లు పాడైపోయాయి. దీంతో ప్రజలు అప్రమత్తమై ముందుగానే ఇళ్లలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

వర్షంతో బోసిపోయిన సంత

గూడెంకొత్తవీధి: గూడెంలో గురువారం కురిసిన భారీ వర్షం కారణంగా సంత వెలవెలబోయింది. దూర ప్రాంతాల నుంచి సంతకు గిరిజనులు వస్తారు. అయితే వర్షం పడడంతో సంత ఆశించిన స్థాయిలో జరగలేదు. ఇటు మైదాన ప్రాంతం నుంచి రావలసిన వ్యాపారులు పూర్తి స్థాయిలో రాలేదు.

డుంబ్రిగుడ: మండలంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పిడుగులతో మొదలైన గాలి వానకు కొన్ని చోట్ల చెట్లు కొమ్మలు పడిపోయాయి. పిడుగుల శబ్దాలకు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఏకధాటిగా రెండు గంటల పాటు వర్షం కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కడబాల ఆనందరావు

వై.రామవరం: మండలంలో నిర్వహిస్తున్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ కడబాల ఆనందరావు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలన్నారు. మండలంలోని సమస్యలపై ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో చర్చించారు. అటవీ శాఖ అడ్డంకులతో ఆగిపోయిన వై.రామవరం నుంచి మఠం భీమవరం మీదుగా గుర్తేడు రోడ్డు నిర్మాణం స్థితిగతులపై అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీడీవో కె.బాపన్నదొర, ఎంపీటీసీలు వీరమళ్ల సుబ్బలక్ష్మి, కరక వెంకటరమణ, మండలంలోని సర్పంచ్‌లు, ఈవోపీఆర్‌డీ శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మాకవరపాలెం: విద్యార్థుల హక్కులకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న అధికారులపై విద్యాశాఖ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గౌతమి లలిత కళాశిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి విద్యార్థులకు వేసవి శిక్షణ ప్రారంభించారు. దీనిపై ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో మండల విద్యాశాఖ అధికారులు వేసవి శిక్షణను పాఠశాలలో జరగకుండా నిలిపివేశారు. దీంతో నిర్వాహకులు తమ దృష్టికి తీసుకువచ్చారని సంపత్‌కుమార్ తెలిపారు. విద్యాహక్కులను హరించేలా అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. రాజకీయ, మతపరమైన , ఇతర ప్రైవేటు కార్యక్రమాలకు పాఠశాలల ఆవరణలో నిర్వహించరాదని ఆదేశాలున్నాయే తప్ప, విద్యార్థులకు యోగా, నృత్యం, స్పోకెన్ ఇంగ్లిష్, చదరంగం వంటి వాటిలో శిక్షణ నిర్వహించ వద్దని ఆదేశాలు లేవన్నారు. జిల్లా వ్యాప్తంగా 50 కిపైగా ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణలు జరుగుతున్నాయని స్వయంగా జేసీ జాహ్నవి ప్రకటించారన్నారు. మాకవరపాలెంలో వేసవి శిక్షణ నిలుపుదల విషయంపై కలెక్టర్, జేసీలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేశామన్నారు. సోమవారం లోగా పాఠశాలలో యదావిధిగా వేసవి శిక్షణ జరిగేలా చర్యలు తీసుకోవాలని లేకుంటే విద్యాశాఖ అధికారులపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.